క్లుప్తంగా

గీత కార్మికుడికి గాయాలు



ఎస్‌ఎస్ తాడ్వాయి : తాటిచెట్టు పై నుంచి పడి గీత కార్మికుడు తీవ్రంగా గాయపడిన సంఘటన మండలంలోని కాటాపూర్‌లో బుధవారం చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన పసినేటి రాజు మధ్యాహ్నం తాటి చెట్టు ఎక్కుతుండగా ప్రమాదవశాత్తు చెట్టుపై నుంచి జారి కింద పడడంతో తీవ్రంగా గాయపడ్డాడు. రాజును స్థానిక కాటాపూర్ ఆస్పత్రిలో వైద్య పరీక్షలు నిర్వహించి మెరుగైన వైద్యం కోసం వరంగల్‌కు తరలించారు. రాజు కుటుంబాన్ని ప్రభుత్వం ఆర్థికసాయం అందించాలని కల్లుగీత కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు నర్సయ్య గౌడ్ కోరారు.

బ్లూటూత్ అందజేత

ములుగు: జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ బాలికల పాఠశాలకు 1993–94 బ్యాచ్‌కు చెందిన పదో తరగతి విద్యార్థులు బ్లూటూత్‌ను అందించారు. బుధవారం పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు మాధవికి అందజేయగా.. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు యాసం సునీత, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సెలవులను పోర్టల్‌లో నమోదు చేయాలి

ములుగు: ఉపాధ్యాయులు తమ సెలవులను ఐఎస్‌ఎంఎస్ పోర్టల్‌లో నమోదు చేయాలని విద్యాశాఖ అధికారి పాణిని బుధవారం ఒక ప్రకటనలో ఆదేశించారు. జనవరి 2023 నుంచి జూన్ నెలాఖరు వరకు తీసుకున్న సెలవుల వివరాలను సంబంధిత స్కూల్ కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు వివరాలను అందించాలని కోరారు. ముందస్తుగా సమాచారం లేకుండా సెలవులు తీసుకుంటే శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

అన్నదానం మహాదానం



భూపాలపల్లి అర్బన్: అన్నదానం ఎంతో గొప్ప కార్యక్రమమని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ బుర్ర రమేష్ అన్నారు. జిల్లా కేంద్రంలోని జిల్లా ప్రధాన ఆస్పత్రిలో జీఎంఆర్ఎం ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అన్నదాన కార్యక్రమంలో బుధవారం బుర్ర రమేష్ పాల్గొన్నారు. రోగుల బంధువులకు భోజనాలు వడ్డించి రమేష్ మాట్లాడారు. ట్రస్ట్ ఆధ్వర్యంలో నిత్య అన్నదాన కార్యక్రమం చేయడం మారుమూల గ్రామాల నుంచి వచ్చేవారికి ఎంతగానో ఉపయోగకరమన్నారు.

విరాళం



గణపురం: గణపురం మండలకేంద్రంలోని పోచమ్మ తల్లి ఆలయ పునఃప్రతిష్ఠాపనకు మండలకేంద్రానికి చెందిన రాచర్ల ఆనందం రూ.1,00,116 విరాళంగా ఆలయ నిర్మాణ కమిటీకి బుధవారం అందచేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ నారగాని దేవేందర్ గౌడ్, ఎంపీటీసీ మోటపోతుల శివశంకర్ గౌడ్, ఆలయ నిర్మాణ కమిటీ బాధ్యులు పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

కాటారం: కాటారం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో స్పాట్ అడ్మిషన్ కోసం నేటి(గురువారం) నుంచి దరఖాస్తులు స్వీకరించనున్నట్లు ప్రిన్సిపాల్ గోవర్ధన్ తెలిపారు. పాలిసెట్ –2023 ద్వారా డీఎంఈ, ఈసీఈ విభాగాల్లో ప్రవేశాలు నిర్వహించినట్లు మిగిలిన సీట్లను స్పాట్ అడ్మిషన్ ద్వారా భర్తీ చేయనున్నట్లు పేర్కొన్నారు. 20న దరఖాస్తుల స్వీకరణ, 25న ఖాళీల వివరాల ప్రదర్శన, 28న స్పాట్ అడ్మిషన్ సర్టిఫికెట్ల పరిశీలన, ఫీజు చెల్లింపు అనంతరం 31న తరగతులు ప్రారంభించనున్నట్లు ప్రిన్సిపాల్ వివరించారు. పదో తరగతి పాస్ అయిన విద్యార్థులు స్పాట్ అడ్మిషన్ కోసం కళాశాలలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. విద్యార్థులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని తెలిపారు. మరిన్ని వివరాల కోసం ఎచ్ఓడీలు కృష్ణ 94409 73492, రామ్మోహన్‌రెడ్డి, 91777 30404లో సంప్రదించాలని తెలిపారు.

కేసు నమోదు

వరంగల్ క్రైం: హనుమకొండ పోలీస్ స్టేషన్ పరిధిలోని కాకతీయ కాలనీకి చెందిన కొప్పుల శ్రావ్యను 2021వ సంవత్సరం నుంచి వేధిస్తున్న జయశంకర్ భూపాలపల్లి జిల్లా మాధవపూర్ గ్రామానికి చెందిన శీలం రాకేష్‌పై ఈవ్‌టీజింగ్ కేసు నమోదు చేసినట్లు హనుమకొండ ఇన్‌స్పెక్టర్ కరుణాకర్ తెలిపారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

గోదావరి పరవళ్లు



వాజేడు: మాట్లాడుతున్న సర్దార్ సింగ్



వెంకటాపురం(కె): ఉధృతంగా ప్రవహిస్తున్న కంకల వాగు



మంగపేట: పొదుమూరు పుష్కరఘాట్ వద్ద ఉధృతంగా ప్రవహిస్తున్న గోదావరి

- ఆందోళనలో ముంపు గ్రామాల ప్రజలు
- అప్రమత్తం అయిన అధికారులు

మంగపేట: మండలంలో గోదారి పరవళ్లు తొక్కుతూ.. ప్రవహిస్తోంది. బుధవారం ఉదయం నుంచి గోదావరి వరద ఉధృతి క్రమంగా పెరుగుతూ సాయంత్రం వరకు 17 అడుగుల ఎత్తులో ప్రవహిస్తోంది. కమలాపురం ఇంటెక్‌వెల్ వద్ద సాయంత్రం 83.05 ఫీట్ల నీటిమట్టం ఉంది. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లో గత మూడు రోజులుగా విస్తారంగా కురుస్తున్న భారీ వర్షాలతో వాగులు, ఒర్రెల ద్వార వచ్చి చేరుతున్న వరద నీటితో పాటు ఛత్తీస్‌గఢ్, మహారాష్ట్ర గోదావరి తీర ప్రాంతాల వరద నీరు, ఎగువ ప్రాంతంలోని ప్రాజెక్టుల గేట్లు తెరిచి నీటిని గోదావరిలోకి వదిలేస్తుండటంతో గోదారమ్మ పరవళ్లు తొక్కుతూ ఉరకలేస్తోంది. ఇదే విధంగా వరద ఉధృతి కొనసాగితే గురువారం మరో 10 నుంచి 12 అడుగుల మేర నీటిమట్టం పెరిగే అవకాశం ఉందని అధికారులు అంచనా వేస్తున్నారు. ప్రజలు గోదావరి వరద ఉధృతిని వీక్షించేందుకు వెళ్లి ప్రమాదానికి గురికావొద్దని అధికారులు హెచ్చరించారు.

ముంపు గ్రామాల్లో అధికారుల పర్యటన

గోదావరి పరివాహక ప్రాంతంలోని వరద ముంపు గ్రామాల్లో మండల స్పెషలాఫీసర్ తుల రవి ఇతర అధికారులతో కలిసి బుధవారం పర్యటించారు. మండల పరిధిలోని పొదుమూరు, కమలాపురం, కత్తిగూడెం, అకినేపల్లిమల్లారం గ్రామాల్లో గత ఏడాది గోదావరి వరద ముంపునకు గురైన ప్రాంతాలను సందర్శించి ప్రజలతో మాట్లాడారు. అనంతరం మల్లూరు పంచాయతీ పరిధిలోని మొట్లగూడెం వద్ద నర్సింహాసాగర్ పంచాయతీ పరిధిలోని శనిగకుంట గ్రామానికి వెళ్లే రోడ్డుపై నిర్మించిన లోలెవల్ కాజ్‌వే పైనుంచి వెళ్తున్న వరద ప్రవాహాన్ని పరిశీలించారు. కాజ్‌వేకు అడ్డుగా.. భారీకేడ్లు ఏర్పాటు చేసి రాకపోకలు నిలిపి వేసి హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేయాలని పంచాయతీ కార్యదర్శి రూప్‌సింగ్‌ను ఆదేశించారు. ఆయన వెంట తహసీల్దార్ ఎంపెల్లి శ్రీనివాసులు, ఎస్సై ఎస్‌కే తాహెర్ బాబా, ఎంపీడీఓ శ్రీనివాస్, ఆర్ఐ కుమారస్వామి, పంచాయతీ కార్యదర్శులు హీరూ, మురళి ఉన్నారు.

రాకపోకలు బంద్

ఎస్‌ఎస్ తాడ్వాయి: మండల పరిధిలోని పడిగాపూర్, ఎల్బాక గ్రామాలకు జంపన్నవాగు వరద కారణంగా బుధవారం నుంచి రాకపోకలు నిలిచిపోయాయి. ఎడతెరిపి లేని వర్షాలకు జంపన్నవాగు ఉధృతంగా ప్రవహిస్తోంది. నార్లాపూర్ చింతల్ క్రాస్ నుంచి ఎల్బాక గ్రామానికి వచ్చే దారిలో జంపన్నవాగు లోలెవల్ కాజ్‌వే పైనుంచి వరద ఉధృతంగా ప్రవహించడంతో పాటు ఎల్బాక నుంచి మేడారానికి వచ్చే దారి మధ్యలోని కొంగలమడుగు వరద రోడ్డుపై నుంచి భారీగా ప్రవహించడంతో రాకపోకలు నిలిచిపోయాయి. తహసీల్దార్ శ్రీనివాస్ కొంగలమడుగు వరదను పరిశీలించి ఆయా గ్రామాల ప్రజలను అప్రమత్తం చేశారు. మరో రెండు రోజులు వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున జంపన్నవాగు చుట్టు పక్కల వ్యాపారులను అధికారులు అప్రమత్తం చేశారు.

సహాయ చర్యలకు సిద్ధంగా ఉండాలి

వాజేడు: ప్రజలకు ఎలాంటి కష్టం, నష్టం జరుగకుండా ఏ క్షణమైనా సహాయం అందించడానికి సిద్ధంగా ఉండాలని మండల ప్రత్యేకాధికారి సర్దార్ సింగ్ అన్నారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో బుధవారం అధికారులు, గ్రామ పంచాయతీల కార్యదర్శులతో వరదలపై ప్రత్యేక సమావేశాన్ని ఆయన నిర్వహించారు. వర్షాలు, వరదలు ఎక్కువగా ఉన్న నేపథ్యంలో ప్రతీ ఒక్కరు ప్రజలకు అందుబాటులో ఉండాలని తెలిపారు. తహసీల్దార్ సయ్యద్ సర్వర్, ఎంపీడీఓ విజయ, ఎంపీఓ శ్రీకాంత్ నాయుడు, ఆర్ఐ రాజు ఉన్నారు.

భారీ వర్షాలకు పొంగిపొర్లుతున్న వాగులు

వెంకటాపురం(కె): మండలంలో గత నాలుగు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు మండలంలోని వాగులు వంకలు పొంగి పొర్లుతున్నాయి. ఎగువ ప్రాంతాల్లో కురిసిన వర్షాలకు వరద నీరు వాగుల్లోకి చేరడంతో వాగులు ప్రమాదస్థాయిని మించి ప్రవహిస్తున్నాయి. మండల పరిధిలోని కంకలవాగు, రాచపల్లి వాగులు ప్రమాద స్థాయిని మించి ప్రవహిస్తున్నాయి. దీంతో పంటపొలాలకు వెళ్లే రైతులు తీవ్ర ఇబ్బందులు పడాల్సి వస్తుంది. కాగా వాగులు పొంగుతుండటంతో కొందరు వ్యక్తులు వలతో చేపల వేట చేస్తున్నారు.

ముంపు ప్రాంతాల పరిశీలన

గోదావరి వరద ముంపు ప్రాంతాలను బుధవారం మండల ప్రత్యేక అధికారి అరవింద కుమార్ ఆధ్వర్యంలో అధికారులు పరిశీలించారు. పాత్రాపురం సమీపంలోని బల్లకట్టు వాగు, పాలెం సమీపంలోని కుక్కతోగు వాగు బోదాపురం సమీపంలోని జిన్నెల వాగు ప్రాంతాలను సందర్శించి వరద పరిస్థితులను పరిశీలించారు. లోతట్టు ప్రాంతాలైన పెంకవాగు, తిప్పాపురం గ్రామాలకు వెళ్లే రహదారుల పై ఉన్న వాగులను పరిశీలించారు. తహసీల్దార్ అంటి నాగరాజు, ఎంపీడీఓ అడ్డూరి బాబు, సీఐ శివప్రసాద్, ఎస్సై తిరుపతి రావు తదితరులు ఉన్నారు.

19ఏళ్ల లోపు వారికి ఆల్బెండజోల్ మాత్రలు



సమావేశంలో మాట్లాడుతున్న వెంకటేశ్వర్లు

ఏటూరునాగారం: 1–19 సంవత్సరాలోపు అర్హులైన చిన్నారులందరికీ జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవం సందర్భంగా ఆల్బెండజోల్ మాత్రలు వేయాలని ఎన్‌సీడీ ప్రోగ్రాం అధికారి, వైద్యులు మంకిడి వెంకటేశ్వర్లు అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని రామాలయం వద్ద ఉన్న హెల్త్ వెల్‌నెస్ సెంటర్ దగ్గర ఎన్‌డీడీ టాస్క్‌ఫోర్స్ టీం సభ్యులతో సమావేశం నిర్వహించారు. రొయ్యూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో ఉన్న సబ్ సెంటర్ల వారీగా సిబ్బంది నులి పురుగుల మందుల పంపిణీతోపాటు సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చూడాలన్నారు. ఏఎన్‌ఎంలు, ఆశ కార్యకర్తలు, అంగన్‌వాడీ టీచర్లు ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లోకి వెళ్లి నులిపురుగుల నివారణ మందులను విద్యార్థులకు వేయాలన్నారు. సూచనలు, సలహాలను పాటిస్తూ కార్యక్రమం పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో డాక్టర్ సుమలత, సీహెచ్‌ఓ శారద, సూపర్‌వైజర్ కమల, ఏఎన్‌ఎంలు గీత, పద్మ, సమ్మక్క, సుగుణావతి అంగన్‌వాడీ టీచర్లు వసంత, కృష్ణకుమారి, రాజేశ్వరి, పద్మ, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

కరకట్ట నిర్మాణం హామీలకే పరిమితం



గోదావరి ఒడ్డున మాట్లాడుతున్న సోమయ్య

మంగపేట: మండల కేంద్రంలోని గోదావరి తీరం వెంట కరకట్ట నిర్మాణం ప్రభుత్వం, పాలకుల హామీలకే పరిమితం అయిందని కాంగ్రెస్ పార్టీ అనుబంధ ఎస్టీసెల్ జిల్లా అధ్యక్షుడు గుమ్మడి సోమయ్య విమర్శించారు. మండల కేంద్రంలోని పొదుమూరు వద్ద గోదావరి వరద కోతకు గురవుతున్న ప్రాంతాన్ని ఆపార్టీ మండల నాయకులతో కలిసి బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో గోదావరి ఒడ్డు వెంట సాగుభూములు వరద కోతకు గురికాకుండా కరకట్ట నిర్మాణం చేపడతామని, ముంపు బాధితులకు మోడల్ కాలనీ నిర్మిస్తామని ఇచ్చిన హామీలు ఏమయ్యాయని ప్రశ్నించారు. ముంపు బాధితులను కాపాడుకునే బాధ్యత తమపై ఉందని అందుకే తమ పార్టీ ములుగు ఎమ్మెల్యే సీతక్క పొదుమూరు ముంపు బాధితుల సమస్య, గోదావరి ఒడ్డు వెంట భూములు కోల్పోతున్న రైతుల సమస్యను అసెంబ్లీ సాక్షిగా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లినట్లు గుర్తు చేశారు. అయినప్పటికీ కరకట్ట నిర్మాణ పనులను నేటికీ చేపట్టలేదన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వ పదేళ్ల కాలంలో ముంపు ప్రాంత ప్రజలకు ఏమి చేసిందనేది ప్రజలు గమనిస్తూనే ఉన్నారని అన్నారు. జరుగబోయే ఎన్నికల్లో ఏముఖం పెట్టుకుని ఓట్లు అడుతారని ప్రశ్నించారు. కార్యక్రమంలో మండల వర్కింగ్ ప్రెసిడెంట్ నర్రా కిశోర్, ఎస్టీసెల్ మండల అధ్యక్షుడు చాద మల్లయ్య నాయకులు మైబూబ్‌ఖాన్, నాగేశ్వర్‌రావు, సురేష్, నర్సింహారావు, కిరణ్, మిదయ్‌తుల్లా పొదుమూరు గ్రామస్తులు లక్ష్మి, సమ్మక్క, శ్రీదేవి, వెంకమ్మ తదితరులు పాల్గొన్నారు.

సమావేశానికి సర్పంచ్‌ల డుమ్మా..

- మొక్కుబడిగా మండల సర్వసభ్య సమావేశం



వైద్య సేవలను వివరిస్తున్న డాక్టర్ రణధీర్



హాజరైన అధికారులు, ప్రజాప్రతినిధులు

ఎస్‌ఎస్ తాడ్వాయి : మండల సర్వసభ్య సమావేశం బుధవారం మొక్కుబడిగా సాగింది. మండల సభలో సమస్యలను నిలదేసే ప్రజాప్రతినిధులే కరువయ్యారు. మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ గొంది వాణిశ్రీ అధ్యక్షతన సర్వసభ్య సమావేశం నిర్వహించారు. అయితే సమావేశానికి సర్పంచ్‌లు డుమ్మా కొట్టారు. మండలంలోని 18 జీపీలకు చెందిన సర్పంచ్‌లలో ఏ ఒక్కరూ సమావేశానికి రాకపోవడం గమనార్హం. అధికారులు నివేదించిన సమస్యలపై ప్రశ్నించాల్సిన సర్పంచ్‌లు గైర్హాజరు కావడంతో గ్రామ పంచాయతీ సమస్యల పై వారికి ఏ మాత్రం శ్రద్ధ ఉందో తేటతెల్లమవుతుంది. దీంతో అధికారులు శాఖల వారీగా గ్రామాల్లోని సమస్యలు, అభివృద్ధి కార్యక్రమాల నివేదికలను చదివి వినిపించారు. రెవెన్యూ సమస్యలపై తహసీల్దార్ శ్రీనివాస్ వివరించారు. వర్షాకాలాన్ని దృష్టిలో పెట్టుకొని వరద ముంపు ప్రాంతాల్లో సెల్ఫ్ డీలర్ షాపులకు ముందుగానే మూడు నెలలకు సంబంధించి బియ్యం నిత్యావసర సరుకులను నిల్వ చేశామని తెలిపారు. వైద్య ఆరోగ్యశాఖ సేవల పై తాడ్వాయి వైద్యాధికారి రణధీర్ ప్రజలకు అందిస్తున్న ఆరోగ్య సేవలను వివరించారు. ఆరోగ్య కేంద్రంలో మలేరియా, డెంగీ నిర్ధారణ పరీక్షల కిట్స్‌తో పాటు అన్ని మందులు అందుబాటులో ఉన్నాయన్నారు. ముంపు ప్రాంతాల్లో డెలివరీకి దగ్గర్లో ఉన్న గర్భిణులను ముందస్తు జాగ్రత్తగా కలెక్టర్ అదేశాల మేరకు సురక్షిత ప్రాంతాలకు వెళ్లాలని సూచించామన్నారు. వర్షాలు కురుస్తున్నందున గ్రామాల్లో వైద్య శిబిరాలు నిర్వహించాలని ఎంపీపీ సూచించారు. ఐటీడీఏ ఏటీబీఓ దేసి రాంనాయక్ గిరిజన సంక్షేమ శాఖ ఆశ్రమ పాఠశాలలోని సౌకర్యాలను వివరించారు. పీఏసీఎస్ సీఈఓ అశ్విని మాట్లాడుతూ మిర్చి పంటను సాగు చేసే రైతులకు ఈసారి పీఏసీఎస్ ద్వారా డ్రిప్ కవర్లు అందిస్తామన్నారు. ఇరిగేషన్ డీఈ సదానందం మాట్లాడుతూ మండలంలోని చెరువులు, కుంటల వివరాలను వివరించారు. సమావేశంలో వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

పంచాయతీ కార్మికుల డిమాండ్లు నెరవేర్చాలి



ఏటూరునాగారం : మాట్లాడుతున్న స్వామి



కన్నాయిగూడెం : నిరసన తెలుపుతున్న పంచాయతీ కార్మికులు



ములుగు రూరల్: మాట్లాడుతున్న రాజేందర్

ఏటూరునాగారం: గ్రామ పంచాయతీ కార్మికులు 14 రోజులుగా సమ్మె చేస్తున్నప్పటికీ రాష్ట్ర ప్రభుత్వం స్పందించకపోవడం బాధాకరమని, వారు చేస్తున్న న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని ఎమ్మార్పీఎస్ జిల్లా నాయకుడు వావిలాల స్వామి అన్నారు. బుధవారం మండల కేంద్రంలో 14వ రోజుకు గ్రామ పంచాయతీ కార్మికుల సమ్మె చేరడంతో ఎమ్మార్పీఎస్ నాయకులు మద్దతు తెలిపి మాట్లాడారు. కార్యక్రమంలో నాయకులు సాంబశివరావు, సతీష్, రాజు, వెంకన్న, లక్ష్మి, లాలు, రమేష్, శ్రీనివాస్, జ్యోతి పాల్గొన్నారు.

కన్నాయిగూడెం: పంచాయతీ కార్మికులు చేపట్టిన సమ్మెలో ఒంటికాలిపై నిలబడి వినూత్నంగా నిరసన తెలిపారు.

వెంకటాపురం(కె): కార్మికుల సమస్యలను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని పంచాయతీ కార్మికుల సంఘం మండల అధ్యక్షులు రంజిత్ అన్నారు. తహసీల్దార్ కార్యాలయం ఎదుట చేపట్టిన సమ్మెలో తాటిశ్రీను, లక్ష్మణరావు,సమ్మయ్య, బుచ్చిబాబు, నాగేశ్వరావు, అనూష పాల్గొన్నారు.

వాజేడు: ఉద్యోగ భద్రత కల్పించాలని కోరుతూ చేపట్టిన గ్రామ పంచాయతీ కార్మికుల సమ్మె బుధవారం నాటికి 14వ రోజుకు చేరుకుంది. వాజేడు మండల పరిధిలోని 17 గ్రామ పంచాయతీల నుంచి కార్మికులు సమ్మెలో పాల్గొంటున్నారు.

ములుగు రూరల్: గ్రామ పంచాయతీ కార్మికులు గత 14 రోజులుగా సమ్మె చేస్తున్నప్పటికీ ప్రభుత్వం ఎలాంటి చర్చలు జరపకపోవడం సరికాదని సీఐటీయూ జిల్లా కార్యదర్శి రత్నం రాజేందర్ అన్నారు. ఈ మేరకు బుధవారం జిల్లాకేంద్రంలో గ్రామ పంచాయితీ కార్మికులు చేపడుతున్న నిరవధిక సమ్మెకు మద్దతు తెలుపుతూ ఆయన మాట్లాడారు. పంచాయతీ కార్మకులకు కనీస వేతనం రూ.19 వేలు చెల్లించాలని అన్నారు. కార్యక్రమంలో నాయకులు పీరయ్య, భిక్షపతి, ప్రవీన్, రవి పాల్గొన్నారు.

ఎమ్మెల్యేపై అనుచిత వ్యాఖ్యలు సరికాదు..



వాజేడు: మాట్లాడుతున్న సీతారామ రాజు

వాజేడు: భద్రాచలం ఎమ్మెల్యే పొదెం వీరయ్యపై బీఆర్ఎస్ నాయకులు చేసిన వ్యాఖ్యలు సరికాదని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు దాట్ల వీర వెంకట సీతారామ రాజు అన్నారు. మండల కేంద్రంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మండల బీఆర్ఎస్ నాయకులు ఇష్టం వచ్చినట్లు మాట్లాడితే ప్రజలు తగిన సమయంలో గుణపాఠం చెబుతారన్నారు. నియోజకవర్గ అభివృద్ధి కోసం రాజ్యాంగం ప్రకారం ఇవ్వాల్సిన నిధులను ఎమ్మెల్యేకు ఇవ్వలేదని తెలిపారు. నియోజకవర్గం అభివృద్ధికి సీఎం ఏం చేశారని ప్రశ్నించారు. దళితులకు మూడెకరాల భూమి, రుణమాఫీ, డబుల్ బెడ్రూమ్ ఇళ్లు, వరదల కారణంగా ముంపునకు గురైన కుటుంబాల వారికి ఇస్తానన్న రూ.10వేలు ఉట్టి మాటగానే మిగిలాయన్నారు. విక్రాంత్, డెనార్జున రావు, కాజావలి, జగన్నాథరాజు, రాంబాబు, లింగయ్య, శ్రీను, సీతాలు, సర్వేశ్వరావు, సంజీవ, రామ్మూర్తి ఉన్నారు.

ఎమ్మెల్యేను విమర్శించే స్థాయి బీఆర్ఎస్ నాయకులకు లేదు

వెంకటాపురం(కె): భద్రాచలం ఎమ్మెల్యే పోదెం వీరయ్యను విమర్శించే స్థాయి బీఆర్ఎస్ మండల నాయకులకు లేదని పీఏసీఎస్ చైర్మన్ చిడెం మోహనరావు అన్నారు. బుధవారం స్థానిక కాంగ్రెస్ పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ఏడాది వరదల సమయలో భద్రాచలంలో వచ్చిన వరదలకు శాశ్వత పరిష్కారం చూపుతామని, ముంపు బాధిత కుటుంబాలకు రూ.10 వేలు ఇస్తామని ఇచ్చిన హామీలు అమలు చేయని ఘటన బీఆర్ఎస్ పార్టీకే దక్కిందని అన్నారు. నిరాధారమైన ఆరోపణలు చేస్తే భవిషత్‌లో ప్రజలే తగిన బుద్ధి చెబుతారని అన్నారు.

ఫసల్ బీమా అమలు చేయాలి



ఆర్డీఓకు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

ములుగు రూరల్: రాష్ట్రంలో ఫసల్ బీమా యోజన కార్యక్రమాన్ని అమలు చేయాలని కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షుడు కృష్ణాకర్ అన్నారు. ఈ మేరకు బుధవారం జిల్లా కేంద్రంలోని ఆర్డీఓకు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్ ఇచ్చిన హామీ మేరకు రైతులకు ఏక కాలంలో రుణమాఫీ చేయాలని అన్నారు. రైతులకు సాగుకు సంబంధించిన ఎరువులను ఉచితంగా అందిస్తామని హామీ ఇచ్చి మోసం చేశారని ఆరోపించారు. రైతులు అకాల వర్షాల కారణంగా యాసంగి సీజన్‌లో నష్టపోయిన పంటలకు పరిహారం అందించాలని అన్నారు. కార్యక్రమంలో భాస్కర్‌రెడ్డి, బలరాం, రమేస్, జవహార్‌లాల్, ఉత్తమ్‌కుమార్, రవిరెడ్డి, సురేందర్ తదితరులు పాల్గొన్నారు.

జలమయమైన దళితకాలనీ

- వాననీటితో ప్రజలకు ఇబ్బందులు
- పట్టించుకోని ప్రజాప్రతినిధులు, అధికారులు
- బాధితుల సమస్యలు తెలుసుకున్న కాంగ్రెస్ నాయకులు



దళితకాలనీలో బాధితులతో మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు

ఏటూరునాగారం: వర్షపు నీటితో దళితకాలనీ జలమయం కావడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్న విషయాన్ని కాంగ్రెస్ నాయకులు అడిగి తెలుసుకున్నారు. స్థానిక గోదావరి, వర్షపు ముంపు ప్రాంతాలను కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ కోర్డినేటర్ ఇర్సవడ్ల వెంకన్న, పార్టీ మండల అధ్యక్షుడు చిటమట రఘు నాయకులతో కలిసి బుధవారం సందర్శించారు. అనంతరం వారు మాట్లాడుతూ గోదావరి ఉధృతంగా ప్రవహిస్తోందన్నారు. ప్రతి సంవత్సరం ఇదే పరిస్థితి, ప్రజలకు శాశ్వత పరిష్కారం చూపించలేని అసమర్థ బీఆర్ఎస్ ప్రభుత్వ పాలన కొనసాగుతుందన్నారు. ములుగు నియోజకవర్గ ఎమ్మెల్యే సీతక్క ఆదేశాలమేరకు ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, కాంగ్రెస్ శ్రేణులు సహాయక చర్యల్లో భాగస్వాములు కావాలన్నారు. రామన్నగూడెం కరకట్ట ప్రమాదకరస్థాయికి దిగువన ఉంది. ప్రజలు సీజనల్ వ్యాధుల బారిన పడకుండా హెల్త్ క్యాంప్ లను ఏర్పాటు చేయాలని కోరారు. అదేవిధంగా ఎస్సీ కాలనీ వాసులకు 51 డబుల్ బెడ్ రూం మంజూరు గాక గత ఐదేళ్ల నుంచి ప్రభుత్వం ఇండ్లను పూర్తి చేసి ఇవ్వక పోవడం బాధాకరమని అన్నారు. జిల్లా కలెక్టర్, మంత్రులు స్పందించి వెంటనే వారికి డబుల్ బెడ్‌రూమ్ ఇండ్లు పూర్తయ్యే విధంగా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సందర్శించిన వారిలో నాయకులు గుడ్ల దేవేందర్, మండల ప్రధాన కార్యదర్శి వావిలాల చిన్న ఎల్లయ్య, మండల ఉపాధ్యక్షులు ఎండీ రియాజ్, టౌన్ అధ్యక్షులు ఎండీ సులేమాన్, సునార్కని శ్రీనివాస్, వావిలాల పెద్ద ఎల్లయ్య తదితరులు ఉన్నారు.

నోట్ పుస్తకాల పంపిణీ



నోట్ పుస్తకాలను చూపుతున్న విద్యార్థులు

మొగుళ్లపల్లి: మండలంలోని రంగాపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు బుధవారం పీఆర్ఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో విద్యార్థులకు నోట్ పుస్తకాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఫౌండేషన్ చెర్మన్ పోల్నేని రాజేశ్వర్‌రావు మాట్లాడుతూ.. విద్యార్థులు బాగా కష్టపడి చదివి పాఠశాలకు గ్రామానికి తల్లిదండ్రులకు మంచి పేరు తేవాలని కోరారు. అనంతరం ప్రధానోపాధ్యాయురాలు శ్రీదేవి మాట్లాడుతూ విద్యార్థుల విద్యాభివృద్ధికి సహకరిస్తున్న ఫౌండేషన్‌కు కృతజ్ఞతలు తెలిపారు. పీఎస్ ప్రధానోపాధ్యాయురాలు లక్ష్మి, ఉపాధ్యాయులు సత్యనారాయణ, రఘు, సదానందం, శర్మ, మార్కండేయ, మాధవి, అనిత, పద్మ, ఫౌండేషన్ సభ్యులు సుధాకర్ యాదవ్, శ్రీనివాస్, చంద్రమౌళి తదితరులు పాల్గొన్నారు.

సర్పంచ్‌పై దాడి.. మహిళల రాస్తారోకో



రాస్తారోకో చేస్తున్న మహిళలు

మహదేవపూర్: సూరారం సర్పంచ్‌పై దాడిని ఖండిస్తూ.. గ్రామస్తులు బుధవారం మండల కేంద్రంలో జాతీయ రాహదారిపై రాస్తారోకో నిర్వహించారు. సూరారం సర్పంచ్ నాగుల లక్ష్మారెడ్డి ఇంటి గోడ విషయంలో నాగుల తిరుపతితో గొడవ జరిగింది. దీంతో సర్పంచ్‌పై దాడిని ఖండిస్తు గ్రామస్తులు మహిళలు మండల కేంద్రంలో రాస్తారోకో చేపట్టారు. ట్రాఫిక్ జామ్ కావడంతో పోలీసులు రాస్తారోకో చేస్తున్న మహిళలకు నచ్చజెప్పి విరమింపజేశారు.